అర్ధాంగి,జెర్రైతే పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీఎంఆర్ ఫౌండేషన్, రంగనాయక రచయితల సంఘం ప్రతినిధులు

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 10 : కొండపాక మండలం సిరిసినగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వీఎంఆర్ ఫౌండేషన్ సహకారంతో రంగనాయక రచయితల సంఘం ఆధ్వర్యంలో అర్ధాంగి, జెర్రైతే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్ది విఠల్, రంగనాయక రచయితల సంఘం అధ్యక్షుడు పిన్నింటి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుహానీరావుకు సన్మానం

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందిస్తున్న సుహానీరావు

బెజ్జంకి, జూలై 10: మండలంలోని తోటపల్లికి చెందిన బోయినిపల్లి ప్రమోద్‌రావు, సరితల కుమార్తె సుహానీరావు యూకే టైటిల్ గెలుచుకొని తొలిసారి గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామస్తులు ఆమెకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె గ్రామంలో ని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బొయినిపల్లి నర్సింగరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మిరుదొడ్డి, జూలై 10 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. బుధవారం మిరుదొడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వానకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నేటికీ రైతు భరోసా అమలు చేయడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను వంచించారన్నారు. మాజీ ఎంపీటీసీ బైరయ్య, నాయకుడు జ్యోతిగౌడ్ పాల్గొన్నారు.

వ్యాధులు పొంచి ఉన్నాయి జాగ్రత్త

హుస్నాబాద్‌టౌన్, జూలై 10: వర్షాకాలంలో వ్యాధులు పొంచి ఉంటాయని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో బుధవారం అప్నాబీమారి భగావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మరకత శివాలయం పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలిగించిన అనంతరం ఆమె మాట్లాడారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వనమహోత్సవ సూపర్‌వైజర్ శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారి భవాని పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

తొగుట జూలై 10: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పొట్టలుగొట్టే జీవోలు తీసుకొస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అంగన్‌వాడీ టీచర్స్,ఆశలు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తహసీల్ కార్యాలయంలో వారు వినతి పత్రం అందజేశారు.

అంగన్‌వాడీలో గ్రోత్ మేళా

మద్దూరు(ధూళిమిట్ట), జూలై10 : ధూళిమిట్ట మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్‌డే నిర్వహించారు. పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి రాజు, హెచ్ఎం రేఖ, ఏఎన్ఎం స్వరూప, ఉపాధ్యాయులు సమత, సురేందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు దుర్గాభవాని, లక్ష్మి, రజిత, ఆయాలు లక్ష్మి, సమత, విజయ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 10 : మండలంలోని కోనాయిపల్లికి చెందిన ముష్ణంధీప్తి కుకునూరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ ఫలితాల్లో 10 జీపీఏ సాధించడంతో పాటు బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించింది. దీంతో బుధవారం పాఠశాలలో విద్యార్థిని కోనాయపల్లి మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి సన్మానించడంతో పాటు రూ.4వేలు. జ్ఞాపిక అందజేశారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం బచ్చలి సత్తయ్య, నాయకుడు నరేందర్ పాల్గొన్నారు.

భ్రూణ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

అరెస్టు చేసిన నిందితులతో సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేశ్, పోలీసు సిబ్బంది

హుస్నాబాద్, జూలై 10: హుస్నాబాద్‌కు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బలవంతంగా అబార్షన్ చేయించిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం సాయంత్రం హుస్నాబాద్ పీఎస్‌లో విలేకరులకు వివరించారు. హుస్నాబాద్‌లో నివాసం ఉంటున్న సుమేరబేగం తనకు ఇష్టం లేకుండా బలవంతంగా తన కుటుంబ సభ్యులు అబార్షన్ చేయించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. ముందుగా కుటుంబ సభ్యులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి ప్రత్యేక బృందంతో విచారణ ముమ్మరం చేశామని తెలిపారు. సుమేరబేగానికి అబార్షన్ చేసిన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని మాధవీ నర్సింగ్‌హోం యాజమాన్యంతో పాటు ఇందుకు సహకరించిన సిబ్బందిని అరెస్టు చేశామన్నారు. అరెస్టయిన వారిలో పాపిరెడ్డి, సత్యనారాయణ, రజిత ఉన్నట్లు చెప్పారు. బలవంతంగా భ్రూణ హత్యలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని, ఇందుకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా సీఐ కోరారు. సమావేశంలో ఎస్సై తోట మహేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సిద్దిపేట టౌన్,జూలై 10 : ఓ కేసులో బెయిల్ మంజూరు కోసం వెళ్లిన తనపై ఎస్సై దురుసుగా ప్రవర్తించి దాడి చేశాడని న్యాయవాది రవికుమార్ ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై ఆయన న్యాయవాదులతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన క్లయింట్ కేసులో కోర్టు బెయిల్ మంజూరు చేసిందని, ఈ విషయంపై మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లామన్నారు. నిందితుడికి ఆరోగ్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ ఎస్సై ఉమారెడ్డి తనతో దురుసుగా వ్యవహరించి దాడి చేశాడన్నారు. ఎస్సైపై చర్యలు తీసుకోవాలని సీఐ ఉపేందర్‌కు ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకుంటామని చెప్పి తనపైన కేసు నమోదు చేశాడని చెప్పారు.తనకు జరిగిన అవమానాన్ని గురువారం బార్‌అసోసియేషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. న్యాయం కోసం నిరసన వ్యక్తం చేసి అనంతరం వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబుకు ఫిర్యాదు చేశామన్నారు. న్యాయవాది రవికుమార్‌పై ఎస్సై ఉమారెడ్డి దాడి చేయలేదని టూటౌన్ సీఐ ఉపేందర్ వివరించారు.కేసు విషయంలో నిందితుడికి బెయిల్ మంజూరుకు న్యాయవాది స్టేషన్‌కు వచ్చాడన్నారు. ఆరోగ్య పరీక్షల నిమిత్తం నిందితుడిని ప్రభుత్వ దవాఖానకు తరలించామని, దవాఖానలో రవికుమార్ ఎస్సై ఉమారెడ్డితో వాగ్వాదానికి దిగి అకారణంగా తోసి వేశాడన్నారు.

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, జూలై 10 : సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం చేర్యాల మండలంలోని వేచరేణిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు బీడీ కాలనీ, ఉర్దూ మీడియం పాఠశాల, బండపల్లిలోని పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు బడుల్లో ప్రభుత్వం విద్యార్థులకు సకల వసతులు సమకూరుస్తుందన్నారు. పాఠశాలల్లో టీవీలను ఉపయోగించి విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంతకుముందు వేచరేణి పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించి, ఆరోగ్యంపై విద్యార్థులకు తగు సూచనలు చేశారు. ఆయన వెంట సీఆర్పీ రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

పోలీసుల తనిఖీలో పట్టుబడ్డ గుట్కాప్యాకెట్లు

సిద్దిపేట టౌన్,జూలై 10 : ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని సిద్దిపేట పోలీసులు పట్టుకున్నారు. టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం ..పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో లక్ష్మీనారాయణ అనే వ్యక్తి తన దుకాణంలో నిషేధిత గుట్కాప్యాకెట్లు అమ్ముతున్నాడనే నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు.ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దుకాణంలో తనిఖీ చేశామన్నారు.అతని వద్ద రూ.66వేల విలువగల గుట్కా ప్యాకెట్లు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్,జూలై 10 : సిద్దిపేట వాసవి,వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో అయ్యప్ప ఆలయం వద్ద యాచకులకు పుల్లూరి శ్రీనివాస్ సహకారంతో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గంప శ్రీనివాస్,మల్లేశం,వీరేశం,క్లబ్ అధ్యక్షురాలు వాణి, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు సుష్మ పాల్గొన్నారు.

ఆలయ భూముల పరిరక్షణకు కృషి

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

చేర్యాల, జూలై10 : చేర్యాల మండలంలోని నాగపురి నల్ల పోచమ్మ దేవాలయ భూములతో పాటు చెరువు భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఆయన నివాసంలో దేవాలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కలిసి భూములను పరిరక్షించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయ, చెరువు భూముల విషయంపై దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి భూముల పరిరక్షణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

హుస్నాబాద్, జూలై 10: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తూ వారి డిమాండ్లను కనీసం పట్టించుకోవడం లేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంటవెంటనే వస్తున్న పోటీ పరీక్షల దృష్ట్యా డీఎస్సీని వాయిదా వేయాలని నిరుద్యోగ యువతీ యువకులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఓయూలో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు, విద్యార్థులపై లాఠీచార్జి చేస్తూ అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డీఎస్సీని 90రోజుల పాటు వాయిదా వేసి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పదేండ్ల తర్వాత డీఎస్సీ నిర్వహిస్తున్నందున అభ్యర్థులు చదువుకునే సమయం ఇచ్చి పరీక్ష నిర్వహించాలని, లేకుంటే హుస్నాబాద్ ప్రాంత నిరుద్యోగులు, విద్యార్థులను కలుపుకొని ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల శంకర్, సీనియర్ నాయకులు సుధాకర్, రాజు, శరత్ పాల్గొన్నారు.

'కస్తూర్బా'లో 'గోరింటాకు' సంబురాలు

సంబురాల్లో పాల్గొన్న కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై10: మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో బుధవారం గోరింటాకు సంబురాలు జరుపుకొన్నారు. విద్యార్థినులు తమ చేతులకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోయారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న మాట్లాడుతూ ఆశాడమాసంలో ఆడపిల్లలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుందని, శాస్త్రీయంగా గోరింటాకు శరీరంలో ఉన్న వేడిని తగ్గిస్తుందన్నారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

జగదేవ్‌పూర్, జూలై10: కుటుంబ కలహాలతో దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఇటిక్యాలలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కర్కపట్ల శేఖర్ (ఏసు)(28)కు దౌలాపూర్ గ్రామానికి చెందిన ఆకారం సౌమ్య(25) గత ఆరేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధి నిమిత్తం శేఖర్ తుర్కపల్లిలోని మామిడి తోటలో సూపర్ వైజర్‌గా పనిచేస్తూ భార్యాపిల్లలతో అక్కడే ఉంటున్నారు. గత సంవత్సరం నుంచి భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈవిషయంలో శేఖర్ అత్తగారింటి వారు కలుగజేసుకొని సర్ధిచెప్పినా గొడవలు జరుగుతుండటంతో సౌమ్య తల్లిగారి ఇల్లు అయిన దౌలాపూర్‌కు వెళ్లింది. 15 రోజుల క్రితం శేఖర్ అత్తగారింటికి వెళ్లి భార్య సౌమ్యను తుర్కపల్లికి తీసుకువెళ్లాడు. మంగళవారం సాయంత్రం ఇద్దరూ తుర్కపల్లి నుంచి ఇటిక్యాల గ్రామంలోని పొలం వద్దకు వెళ్లారు. గడ్డి మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఇద్దరిని 108లో చికిత్స నిమిత్తం గజ్వేల్ సర్కారు దవాఖానకు తరలించారు. అప్పటికే సౌమ్య మృతిచెందగా శేఖర్‌ను హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ విషమించి బుధవారం మృతి చెందాడు. మృతుల కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమక్షమన్ తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గజ్వేల్, జూలై 10: నాణ్యతలేని ఆహారం.. అపరిశుభ్రంగా హాస్టల్ వాతావరణంలో నిత్యం విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి అన్నారు. గజ్వేల్‌లో బుధవారం విద్యాహక్కుల పరిరక్షణ ఉద్యమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ హాస్టల్ మెస్‌లో చట్నీలో చిట్టెలుక ప్రత్యేక్షమవడం, రామాయంపేట మోడల్ పాఠశాలలో అల్పాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వసతిగృహాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకుంటారని వారికి ప్రభుత్వం సదుపాయాలు కల్పించాలన్నారు. నాణ్యమైన భోజ నం అందించాలని, అధికారులు చొరవ తీసుకొని పర్యవేక్షణ చేయాలన్నారు.

ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ

వేలూర్‌లో ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న రిషిత్‌రెడ్డి కుటుంబసభ్యులు

వర్గల్, జూలై 10 : మండంలోని వేలూర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆగ్రామానికి చెందిన అట్ల శ్యామ్‌సుందర్ రెడ్డి,కిరణ్మయిరెడ్డి దంపతుల కొడుకు రిషిత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రభు త్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా రూ. 13వేల విలువ చేసే నోట్‌బుక్స్ పంపిణీచేశారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉమలతాగోవర్ధన్‌గౌడ్,శ్రీనివాస్‌గౌడ్,సంతోష్ గుప్తా పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాయపోల్, జూలై 10 : డెంగీవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయపోల్ మండల వైద్యాధికారి మహరాజ్‌బల్లా తెలిపారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో డెంగీవ్యాధికి కారణమయ్యే దోమల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. చెట్లపొదలు, నీరునిల్వలు లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటిముందు, ఖాళీస్థలాలు,డ్రైనేజీల్లో దోమల నివారణకు కారణమయ్యే మందులను పిచికారీచేయాలని ఆయన సూచించారు.

కార్మికులకు కనీస వేతనం నిర్ణయించాలి

చేర్యాలలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

చేర్యాల, జూలై 10: కార్మికులందరికీ రూ.26వేల కనీస వేతనం నిర్ణయించాలని సీఐటీయూ చేర్యాల పట్టణ కన్వీనర్ రాళ్లబండి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, తహసీల్దార్ మహ్మద్ సమీర్‌ఆహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభు త్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. సమా న పనికి సమాన వేతనం అందించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ రేపాక కుమార్, రాళ్లబండి నాగరాజు, సంతోష్, బోయిని మల్లేశం, రాళ్లబండి చందు, రామచంద్రం, ప్రశాంత్, రాజు, శేఖర్, యాదగిరి, మంజుల, కనకవ్వ, పద్మ, అంజమ్మ, నవ్వ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

గజ్వేల్, జూలై 10: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని కోరుతూ కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి, వేణుగోపాల్, వెంకటాచారి, మల్లయ్య, రాజులు, రమేశ్, రామారావు పాల్గొన్నారు.

నారాయణరావుపేటలో..

నారాయణరావుపేట, జూలై 10: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ మండల నాయకుడు తునికి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నారాయణరావుపేట తహసీల్ కార్యాలయంలో వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్‌కు అందజేశారు. రాజలింగం, భూపతి, మల్లయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండపాకలో..

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 10 : ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు జాలిగామ ప్రభాకర్ డిమాండ్ చేశాడు. బుధవారం కొండపాక మండల కేంద్రంలోని ఐవోసీ భవనంలో తహసీల్దార్ దిలీప్‌నాయక్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బర్మ కొమురయ్య, పల్లె శ్రీనివాస్, కొమ్ము నర్సింహులు, కనకచారి, ఐలయ్య, అంజయ్య పాల్గొన్నారు.

మాత్‌పల్లిలో ఉచిత వైద్యశిబిరం

వైద్యశిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా మందులు అందజేస్తున్న నాయకులు

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 10 :కుకునూరుపల్లి మండలం మాత్‌పల్లిలో బుధవారం అతిథి దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహిపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ బాలలక్ష్మి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ప్రజలకు చేరువకావాలి

సిద్దిపేట టౌన్,జూలై 10 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసి సిద్దిపేట లయన్స్ క్లబ్ ప్రజలకు చేరువకావాలని లయన్ సూర్యరాజ్ అన్నారు.సిద్దిపేట లయన్స్ క్లబ్ భవన్‌లో బుధవారం 52వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ హితం కోసం అంకితభావంతో పని చేయాలన్నారు.అనంతరం డాక్టర్ డేను పురస్కరించుకొని పలువురు వైద్యులను సత్కరించారు. జిల్లా గవర్నర్ అమర్నాథ్ రావు,విజయలక్ష్మి,లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జోజి, సురేశ్‌కుమార్, నరసింహరెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి, మామిడాల శ్రీనివాస్, జ్యోతి,రమేశ్, వైకుంఠం, సత్యానందం,శేఖర్, నాగరాజు, మధు, సత్యం,చందు పాల్గొన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన ఉపాధ్యాయ సంఘం నేత

విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లికార్జున్

గజ్వేల్, జూలై 10: విద్యాశాఖ నూతన డైరెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన నరసింహారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం సీపీఎస్ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గజ్వేల్ ప్రాంతానికి చెందిన నరసింహారెడ్డి ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి విద్యాశాఖ సంచాలకుడిగా ఎదగడం ఉపాధ్యాయలోకానికి గర్వకారణమన్నారు.

జయంతి కరపత్రం విడుదల

కరపత్రాన్ని విడుదల చేస్తున్న మాదిగ జాగృతి సంఘం నాయకులు

సిద్దిపేట, జూలై 10 : జాంబవ మహారాజ్ జయంతి సందర్భంగా సిద్దిపేటలో జయంతితో పాటు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు మాదిగ జాగృతి సంఘం నాయకులు పెర్క దుర్గయ్య, బయ్యారం ఇస్తారి, పొడి శెట్టి భూమయ్య, జువ్వన్న శంకరులు తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో జాంబవ మహారాజ్ జయంతి కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ మందబాబు, గోల్కొండ నరసయ్య, దేవయ్య, యాదగిరి, మల్లికార్జున్, రవీందర్, ఉదయ్, దయానంద్, కనకరాజు పాల్గొన్నారు.

104 వాహనాల ఈ వేలం

సిద్దిపేట, జూలై 10 : జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో 104 వాహనాల ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 104 వాహనాలకు సంబంధించిన వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఆరు వాహనాలు ఉన్నాయని, ఒక వాహనం గజ్వేల్ దవాఖానలో, హుస్నాబాద్ సీహెచ్‌సీలో ఒక వాహనం ఉందన్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు www.auction.telanganagov.in వెబ్ సైట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ముదిరాజ్ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మిరుదొడ్డి, జూలై 10 : ముదిరాజులకు ఇచ్చిన హామీలను